సాక్షి నిజామాబాద్

బుధవారం । 16 । ఆగస్టు । 2023



ప్రతిభకు ప్రశంసలు

విధుల్లో ప్రతిభ కనబర్చిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు.

8లో ▸



కవితవి అవినీతి రాజకీయాలు

ఎమ్మెల్సీ కవిత అవినీతి రాజకీయాలు చేస్తున్నారని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ సర్కార్ వస్తుందన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

31.7 /23.9

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆయుష్మాన్ భారత్‌లో జీజీహెచ్‌కు నాలుగో స్థానం



ఖలీల్‌వాడి : ఆయుష్మాన్ భారత్ పథకంలో జాతీయస్థాయిలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి 4వ స్థానం సాధించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ తెలిపారు. మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అనస్థీషియా వైద్యులు డాక్టర్ కిషన్‌ను సన్మానించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రశంస పత్రం అందుకున్న ఆస్పత్రి సిబ్బందిని అభినందించారు. ఉత్తమ ఆయుష్మాన్ భారత్ సేవలను అందించినందుకు గాను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఉత్తమ పనితీరు అవార్డును సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్‌కు అందజేశారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం..


బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ఫ్లో ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గుతోంది. ఒక్క రోజు వ్యవధిలో 0.10 అడుగుల నీటి మట్టం తగ్గింది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 3150 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి నుంచి కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 360 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 135 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు మొత్తం 7175 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090 (84.81 టీఎంసీలు) అడుగుల నిల్వ ఉంది.

కులవృత్తుల వారికి ప్రభుత్వం అండ



వర్ని: తెలంగాణలో కులవత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని, వారికోసం బీసీ బంధు పథకం ద్వారా రూ.1లక్ష ఆర్థికసాయం అందజేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మండలకేంద్రంలో మంగళవారం వర్ని, మోస్రా, చందూర్, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన బీసీ కులవృత్తుల ఆర్థికసాయం చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా సహకార బ్యాంక్ అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డి, ఎంపీపీలు మేక శ్రీలక్ష్మీ వీర్రాజు, పిట్లా ఉమా శ్రీరాములు, అక్కపల్లి సుజాత నాగేందర్, వల్లేపల్లి సునీత, జెడ్పీటీసీలు హరిదాసు గంగారాం, భాస్కర్‌రెడ్డి, శంకర్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మూడ్ కవిత, ఉపాధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు



ఖలీల్‌వాడి: పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉమ్మడి నిజామాబాద్ పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు షకీల్‌పాషా ఫిర్యాదు చేశారు. ఈనెల 14న పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో పోలీసుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడినందున ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశామన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా శాంతిభద్రతల విధులు నిర్వహిస్తున్న పోలీసులపై మాట్లాడటం సరైంది కాదన్నారు.

'ఇంటింటా ఇన్నోవేషన్'లో జిల్లా ప్రదర్శన

నిజామాబాద్ అర్బన్ : ఇంటింటా ఇన్నోవేషన్ ఐదో విడత కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రదర్శన ఎంపికైంది. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల్లో ఆవిష్కరించిన వాటిని ప్రదర్శించారు. ఇందులో జిల్లాకు చెందిన ప్రదర్శన 'బ్రిక్స్ లిఫ్టింగ్ విత్‌ఔట్ కరెంట్' కూడా ఎంపికైందని తెలంగాణ ఇన్నోవేషన్ చీఫ్ ఆఫీసర్ డాక్టర్ శాంత తెలిపారు.



పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల ప్రదర్శన

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- వ్యవసాయంలో దేశంలోనే ఉన్నత స్థానానికి చేరాం
- ఆదర్శంగా రైతురుణమాఫీ, గృహలక్ష్మి, దళిత బంధు, తదితర పథకాలు
- స్వాతంత్ర్య దినోత్సవాల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్ : వ్యవసాయ రంగంలో దేశంలోనే ఉన్నత స్థానానికి చేరామని, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొని మంత్రి జాతీయ జెండా ఎగురవేశారు. ప్రసంగం ఇలా సాగింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలు అభివృద్ధి చెందుతున్నారు. రైతురుణమాఫీ, గృహలక్ష్మి, ముస్లిం, మైనారిటీ, వెనుకబడిన తరగతుల వారి కి రూ.1 లక్ష ఆర్థిక సహాయం, దళిత బంధు, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, కంటి వెలుగు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు, తదితర సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి.

వ్యవసాయ రంగం..

వానాకాలం 2023లో ఇప్పటి వరకు వరి 3,90,564 ఎకరాలతో పాటు ఇతర పంటలు కలుపుకొని మొత్తం 5,00,285 ఎకరాలలో రైతులు పంటలు సాగవుతున్నాయి.

రుణమాఫీ పథకంలో భాగంగా 23,444 మంది రైతులకు రూ 44.65 కోటు మాఫీ అయ్యాయి. రైతుబంధులో భాగంగా 2018-19 నుంచి వానాకాలం 2023 వరకు 2,60,617 మంది రైతులకు రూ.2616.90 కోట్లు రైతుల ఖాతాలలో జమ అయ్యాయి. వానాకాలం 2023 కు గాను ఇప్పటి వరకు రూ. 231.18 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేశాము. ఏప్రిల్ 2023లో కురిసిన అధిక వర్షాలకు 9170.38 ఎకరాలలో పంట నష్టపోయిన 8702 రైతులకు రూ 9.17 కోట్ల పంట నష్ట పరిహారం మంజూరు చేశాము.



మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

పల్లె ప్రగతి..

2022 – 23 సంవత్సరానికి 15 వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ. 29.44 కోట్లు, ఎస్ఎఫ్‌సీ నిధులు రూ. 53.02 కోట్లు గ్రామ పంచాయతీలకు విడుదలయ్యాయి.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ..

వివిధ పింఛన్‌ల కింద ప్రతి నెల 2,77,706 మందికి రూ. 57 కోట్ల 93 లక్షల పంపిణీ జరుగుతోంది. వడ్డీ రాయితీ 2023-24 సంవత్సరంలో మొత్తం 20,582 సంఘాలకు రూ. 71.96 కోట్లు విడుదల అయ్యాయి.

పట్టణ ప్రగతి..

నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో పట్టణ ప్రగతి ద్వారా రూ.51.55 కోట్ల , సీఎం అస్యూరెన్స్ నిధుల ద్వారా రూ. 300 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనెజ్ పనుల కోసం రూ.160 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ. 149.65 కోట్లు, ఎస్‌డీఎఫ్ 2022-23 ద్వారా రూ. 100 కోట్లు, 15 ఆర్థిక సంఘం ద్వారా రూ. 36.77 కోట్లు, జీవో 65 ద్వారా రూ. 6.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది. బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో వివిధ విభాగాల ద్వారా అభివృద్ధి పనులు జరుగనున్నాయి.

విద్యుత్ శాఖ..

అన్ని కేటగిరిల వినియోగదారులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం. నాయీ బ్రాహ్మణ, రజక వృత్తుల వారు 2,979 మందికి 250 యూనిట్స్ వరకు ఉచిత విద్యుత్తును అందుతోంది.

గృహ నిర్మాణ శాఖ..

గృహ లక్ష్మి పథకం కింద మొత్తము 16,500 ఇళ్లు మంజూరయ్యాయి. రూ.3 లక్షల పూర్తి సబ్సిడీతో సొంత స్థలము కల్గిన అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ జరుగనుంది.



జెండా ఎగురవేసి అభివాదం చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యేలు గణేశ్ గుప్తా, జీవన్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

విద్యా శాఖ..

జిల్లాలో 407 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం 2022 జనవరిలో 'మనఊరు మన బడి, మన బస్తీ మన బడి' ప్రధాన కార్యక్రమాన్ని 150.10 కోట్లతో ప్రారంభించింది. ఇప్పటి వరకు 318 పాఠశాలలకు రూ. 31.21 కోట్లు వ్యవయమయ్యాయి.

వైద్య, ఆరోగ్య శాఖ..

జిల్లాలోని ఐదు బస్తీ దవాఖానాలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో 141 పల్లె దవాఖానాలు ఏర్పాటయ్యాయి. కంటి వెలుగు పథకం ద్వారా కంటి పరీక్షలు చేసి 1,66,557 మందికి అద్దాల పంపిణీ, 1,987 మంది కి శస్త్ర చికిత్స చేశారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ద్వారా 134 రకాల పరీక్షలు 4,58,564 మందికి ఉచితంగా చేశారు.



షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ

దళిత బంధు పథకంలో మొదటి విడత 550 యూనిట్లకు గాను రూ.55.00 కోట్లతో యూనిట్లు ఏర్పాటయ్యాయి. రెండవ విడతలో జిల్లాకు 6,050 యూనిట్లు మంజూరు అయ్యాయి.

అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం 4,229 మంది గిరిజన రైతులకు 8,611.14ఎకరాలకు సంబంధించిన అటవీ భూమి హక్కు పత్రాలను పంపణీ జరిగింది. ముస్లిం మైనారిటీ అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున మొత్తం 648 మందికి రూ. 6.48 కోట్లు మంజూరయ్యాయి.

కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, నగర మేయర్ నీతూ కిరణ్, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరందు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణకు హరిత హారం..

2023-24 సంవత్సరానికి 47.978 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం కాగా, 33 లక్షల మొక్కలు నాటారు. ధరణిలో భాగంగా జిల్లాలో అన్ని మండలాలలో నేటి వరకు 54,533 రిజిస్ట్రేషన్ లు 4,397 నాలా, 8,809 పెండింగ్ మ్యుటేషన్‌లు , 219 పార్టిషన్ కేసులు చేసి పాసు పుస్తకాలు జారీ చేశాము. పార్ట్ - బిలో ఉన్న భూములకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు 30,831 భూ సమస్యల గురించి దరఖాస్తులు రాగా అందులో 26,215 దరఖాస్తులు పరిష్కారమయ్యాయి.

నీటి పారుదల శాఖ

2014 నుంచి 2022 వరకు భారీ, మధ్య తరహా, చిన్న నీటి పారుదల, చెక్ డ్యాంలు, చిన్న నీటి ఎత్తిపోతల పథకాలు, పుష్కర ఘాట్‌ల పనుల కోసం రూ.5217.39 కోట్లు కేటాయించగా, రూ.3919.21 కోట్లు ఖర్చు అయ్యాయి. 47 చెక్‌డ్యాంల నిర్మాణానికి 170.14 కోట్లు ఖర్చు అయ్యాయి. లక్ష్మికెనాల్ ఆధునీకరణకు రూ. 20.44 కోట్లకుగాను ఇప్పటి వరకు 9.13 కోట్లు ఖర్చు అయ్యాయి. ప్యాకేజీ 20లో 2014 తరువాత రూ. 569.52 కోట్లు, ప్యాకేజీ 21లో 2014 తరువాత 271.23 కోట్లు ఖర్చు అయ్యాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవన పథకంలో భాగంగా ముప్కాల్ పంప్‌హౌస్ వద్ద రూ. 610 కోట్లతో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చాము.

కలెక్టరేట్లో..

నిజామాబాద్‌అర్బన్ : జిల్లా కలెక్టరేట్లో మంగళవారం 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కలెక్టరేట్లోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు జిల్లా అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఇతర శాఖల జిల్లా అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.



భరతమాత వేషధారణలో చిన్నారి



స్వాతంత్ర్య సమరయోధులకు పాదాభివందనం చేస్తున్న మంత్రి వేముల



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి



స్వాతంత్ర్యోత్సవాల్లో పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు

దిద్దుబాటు చర్యలు..!

- వెంచిర్యాల్ శివారులో చెక్ డ్యాం ఎత్తు తగ్గింపునకు తవ్వకాలు
- గత రెండు సంవత్సరాలుగా పంటలకు భారీ నష్టం
- మీటర్ ఎత్తు తగ్గించాలని రైతుల డిమాండ్

బాల్కొండ : ముప్కాల్ మండలం వెంచిర్యాల్ శివారులో పెద్ద వాగుపై నిర్మించిన చెక్ డ్యాం ఎత్తు తగ్గించేందుకు తవ్వకాలు చేపట్టారు. చెక్ డ్యాం ఎత్తు ఎక్కువ కావడం వలన పెద్ద వాగు అధికంగా ప్రవహించినప్పుడు దిగువ ప్రవాహానికి చెక్ డ్యాం గోడ అడ్డు పడటంతో నీరు పై భాగం నుంచి పోటెత్తడం వలన గత రెండేళ్లుగా తీవ్రంగా పంట నష్టం వాటిల్లింది. చెక్ డ్యాం ఎత్తు తగ్గిస్తే నీరు వేగంగా దివకు ప్రంహించినీరు పై భాగం గుండా పోటెత్తే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.



చెక్ డ్యాం గోడను ఫీట్ వరకు జేసీబీతో తొలగింపు చర్యలు

హైడ్రోగ్రాఫిక్ సర్వే చేపట్టకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడం వలనే పెద్ద వాగు పై నిర్మించిన చెక్ డ్యాంలతో పెద్ద వాగు పక్కన ఉన్న భూముల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం కూడ ఎలాంటి సర్వే లేకుండానే దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కనీసం సర్వే చేపట్టి ఎత్తు తగ్గించే ఆలోచన చేస్తే భవిష్యత్తులో మళ్లీ పంట నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

మీటర్ తగ్గించాలి..

చెక్ డ్యాం పై నిర్మించిన గోడను మీటర్ తగ్గించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం అధికారులు ఫీటు ఎత్తు మాత్రమే తగ్గిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫీటు ఎత్తు తగ్గిస్తే మళ్లీ నీరు పోటెత్తి పంటలు కొట్టుకు పోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెక్ డ్యాం గోడ ఎత్తును ప్రొక్లెయిన్‌తో ఫీటు వరకు మాత్రమే అధికారులు తగ్గిస్తున్నారు. దిద్దు బాటు చర్యలు అనేవి శాశ్వత పరిష్కరంగా ఉండాలని రైతులు అంటున్నారు. కేవల ఓట్ల కోసమే పనులు చేపడుతున్నట్లు ఉందని విమర్శిస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి భవిష్యత్తులో మళ్లీ పంట నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

మళ్లీ పంటలు మునుగుతాయి..



చెక్ డ్యాం వద్ద ప్రస్తుతం తగ్గిస్తున్న ఎత్తు వలన వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. పెద్ద వాగు వస్తే మళ్లీ పంటలు నీటి పాలవుతాయి. సర్వే చేపట్టి ఎత్తు తగ్గిస్తే పంటలు నీట మునిగే అవకాశం ఉండదు.

– నద్ముడ రమేశ్, రైతు

భూగర్భ జలం పెరుగుతుందనుకుంటే..



చెక్ డ్యాం గోడ మీటర్ ఎత్తు తగ్గించాలి. అప్పుడే నీరు పైభాగం నుంచి పొంగి రాదు. లేదంటే మళ్లీ వచ్చి పంటలను మొత్తం నాశనం చేస్తుంది. నీళ్ల నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరుగుతాయని అనుకుంటే పంటలే నాశనమవుతున్నాయి.

– రాజేశ్వర్, రైతు

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో నవయువ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ధర్పల్లి జెడ్పీటీసీ జగన్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలు సిద్ధించడానికి బడుగు బలహీన వర్గాల్లో మరింత చైతన్యం రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎస్ఆర్ఐ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రెంజర్ల రాజేష్, గజ్జెల అశోక్, సర్పంచ్ దేవాగౌడ్, ఎంపీటీసీ గంగారం, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, వైస్ ఎంపీపీ రాజన్న, రాజేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మోహన్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్త్రీలలో అనంతమైన శక్తి



నందిపేట్: స్త్రీలో అనంతమైనటువంటి శక్తి ఉంటుందని, దాన్ని సక్రమమైన మార్గంలో ఉపయోగించుకోవాలని బ్రహ్మ కుమారీలు పేర్కొన్నారు. నందిపేటలోని కేదారేశ్వర ఆశ్రమంలో మంగళవారం బ్రహ్మకుమారీస్ స్టేట్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు తమకు కలిగే మానసిక ఒత్తిడి, ఆందోళనను పాజిటివ్ థింకింగ్ ద్వారా తగ్గించుకోవచ్చునని దీనికి ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాముల మహారాజును బ్రహ్మకుమారీలు సన్మానించారు. నిజామాబాద్ బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకులు సునీత తదితరులు ఉన్నారు.

ప్రతిభకు ప్రశంసలు

నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు.



మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న చీఫ్ ఇంజనీర్ ఇరిగేషన్ నిజామాబాద్ జిల్లా అధికారి మధుసూదన్‌రావు



ప్రశంసాపత్రం అందుకుంటున్న జీజీహెచ్ వైద్యురాలు నాగపద్మ



భద్రినారాయణ, ఎస్ఈ ఇరిగేషన్ | రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ ఆర్అండ్‌బి | రవీందర్, ఎస్ఈ ఎన్‌పీడీసీఎల్



వాజిద్ హుస్సేన్, వ్యవసాయ శాఖ | మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ | వెంకటరమణ, ఆర్టీవో | కోటేశ్వరరావు, ట్రెజరీ అధికారి | బాబురావు, చీఫ్ ప్లానింగ్ అధికారి | ముత్తెన్న, యూత్ స్పోర్ట్స్ వెల్ఫేర్ | నాగోరావ్, ట్రైబల్ అభివృద్ధి అధికారి



జగన్నాథ చారి, పశువైద్య,సంవర్ధక శాఖ | ప్రశాంత్‌కుమార్, కలెక్టరేట్ ఏవో | రషీద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ | సోహైల్, అడిషనల్ కలెక్టర్ సీసీ | ఇందిర, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ | నర్సింగ్‌రావు, ఫైర్ స్టేషన్ అధికారి | అలుక కిషన్, టీఎన్జీవో అధ్యక్షుడు | దినేశ్‌బాబు, టీఎన్జీవో ప్రతినిధి | జాకీర్‌హుస్సేన్, టీఎన్జీవో ప్రతినిధి | ఉమాకిరణ్, టీఎన్జీవో ప్రతినిధి | విజయ్‌కాంత్ రావు రోటరీ క్లబ్ జెమ్స్ అధ్యక్షుడు



కిరణ్‌కుమార్, నిజామాబాద్ ఏసీపీ | అరుణ్ కుమార్, ఏసీపీ హోంగార్డ్స్ | చందర్ రాథోడ్, ట్రాఫిక్ సీఐ | విజయ్‌బాబు, వన్‌టౌన్ సీఐ | వెంకట్ నారాయణ, సౌత్ సీఐ | శ్రీనివాస్ రాజ్, బోధన్ రూరల్ సీఐ | రాజశేఖర్, కమ్మర్‌పల్లి ఎస్సై | వినయ్, వేల్పూర్ ఎస్సై | చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ | రేఖరాణి ఉమెన్ కానిస్టేబుల్

నియామకం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ముస్కు నర్సయ్యను మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామిస్తు జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.

వైద్యవిద్యార్థి నిఖితకు గోల్డ్‌మెడల్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో మంగళవారం స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలలో విద్యనభ్యసిస్తూ ఎంబీబీఎస్ జనరల్ మెడిసిన్‌లో టాపర్‌గా నిలిచిన పంచరెడ్డి నిఖితకు కార్యక్రమ ముఖ్య అతిథి డాక్టర్ డీఎల్ఎన్ స్వామి గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిర, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, వైస్ ప్రిన్సిపాల్ నాగమోహన్, ఏడీ సుదర్శన్ కుమార్, సూపరింటెండెంట్ పెద్దోళ్ల నాగరాజు, మధుసూదన్, గంగాధర్, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ కోటి ఈఎన్‌టీ ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి నిఖితకు సర్టిఫికెట్, మెడల్ అందిస్తున్న డీఎల్ఎన్ స్వామి, ఇందిర

ఎమ్మెల్సీ కవితవి అవినీతి రాజకీయాలు

నిజామాబాద్ నాగారం : మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత అవినీతితో కూడిన రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. నగరంలోని రాజస్థాన్ భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీవీలో బ్రేకింగ్ అంటూ వేస్తూ కార్యకర్తల్లో అయోమయం సృష్టిస్తున్నారని, గెలిచే గుర్రాలని అభ్యర్థులుగా ప్రకటిస్తారని ప్రజాదరణ ఉన్నవారికి టికెట్లు వస్తాయన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని ఇవన్నీ కేసీఆర్ చేసే జిమ్మిక్కులన్నారు. రాష్ట్రంలో బీజేపీ సర్కార్ రాబోతుందన్నారు. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీలను గెలిచి మోదీకి బహుమానంగా అందజేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పార్లమెంట్‌లో అనేక పనులు ప్రారంభించామన్నారు. కేసీఆర్ చేసే ప్రతి పనిలో పూర్తిగా కమిషన్ల రాజ్యం నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

క్రైం కార్నర్

మంజీరలో దూకి యువకుడి ఆత్మహత్య

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండలం హంగర్గా గ్రామానికి చెందిన బీరుగొండ (24)అనే యువకుడు గ్రామ శివారులోని మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నదికి సమీపంలోని పొలంలో సోమవారం మధ్యాహ్నం పనిచేస్తున్న బీరుగొండ అకస్మాత్తుగా మంజీర నదిలో దూకి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సాయంత్రం వరకు నదిలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం మళ్లీ గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హిందీ ఉపాధ్యాయుడి మృతి



ఉదయ్ దత్తు (ఫైల్)

భిక్కనూరు : హిందీ ప్రచారక సమితి జిల్లా ప్రతినిధి భిక్కనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జోషి ఉదయ్ దత్తు (55) మంగళవారం వేకువజామున మృతి చెందారు. ఆయన ఇటీవల ఉత్తరభారతంలో తీర్థయాత్రకు వెళ్లి అక్కడ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయనను విమానంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజుల క్రితం ఆరోగ్యం కుదుట పడిందని, నాలుగురోజుల్లో డిశ్చార్జి చేస్తామని వైద్యులు చెప్పినప్పటికీ మంగళవారం వేకువజామున అకస్మాత్తుగా మృతిచెందాడు. ఆయన అంత్యక్రియలను స్వస్థలమైన నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్కనూరు పాఠశాలలో ఉపాధ్యాయులు ఆయను నివాళులు అర్పించారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుబ్బలోని గుమస్తాకాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్‌బాబు ఆధ్వర్యంలో దాడి చేయగా రూ.11,560 తోపాటు ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాటాడే వారి వివరాలు 87126 59839కు సమాచారం ఇవ్వాలన్నారు.

హత్య కేసులో ఒకరి అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

బాన్సువాడ : బాన్సువాడలో జరిగిన హత్య కేసులో న్యాయవాది ఉబేద్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ పోలీస్టేషన్‌లో మంగళవారం డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని అర్ఫత్ కాలనీకి చెందిన షేక్ అహ్మద్(45) అనే వ్యక్తి తన ఇంటిపై రెండో అంతస్తు కట్టేందుకు సాజిద్ అనే కాంట్రాక్టర్‌కు రూ.18 లక్షలకు మాట్లాడి రూ.17 లక్షలు ఇచ్చాడు. కానీ సాజిద్ పనిచేయకపోవడంతో అతడిపై కేసు పెట్టేందుకు ఉబేద్ అనే లాయర్‌ను ఈనెల 12న అహ్మద్ కలిశాడు. ఫీజు విషయంలో ఉబేద్‌కు, షేక్ అహ్మద్‌కు మధ్య గొడవ జరగగా అహ్మద్‌ను లాయర్ ఉబేద్ కర్ర, బండరాయితో కొట్టడంతో గాయాలు కాగా తీవ్ర గాయాలయ్యాయి. మొదట బాన్సువాడ ఆస్పత్రికి అనంతరం నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అహ్మద్ మరణించాడు. అహ్మద్ సోదరుడు మహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఉబేద్‌ను పట్టుకుని 14న రిమాండ్ చేశామన్నారు. నిందితుడిని పట్టుకున్న సీఐ మహేందర్‌రెడ్డి, రాజశేఖర్, స్వామి, గంగాధర్, అశోక్‌లను డీఎస్పీ అభినందించారు.

అండర్ వే బ్రిడ్జి కోసం విన్నపాలు

- జాతీయ రహదారి 44పై అండర్ వే బ్రిడ్జ్ నిర్మించాలని డిమాండ్
- రోడ్డు క్రాస్ చేస్తూ ఏటా ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- తాజాగా రెండు రోజుల క్రితం యువకుడి మృతి



ముప్కాల్ మండల కేంద్రంలో బైపాస్ వద్ద అండర్ వే బ్రిడ్జి కోసం డిమాండ్ చేస్తున్న జంక్షన్ ఇదే..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 బైపాస్ వద్ద గల జంక్షన్ వద్ద అండర్ వే బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు ఏళ్ల తరబడి నుంచి డిమాండ్ చేస్తున్నారు. 2007లో రహదారి వెడల్పు చేపట్టడంతో పాత జాతీయ రహదారి గుండా రోడ్డును వెడల్పు చేపడితే ఇళ్లు భారీగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో గ్రామం పక్క నుంచి జాతీయ రహదారిని నిర్మించారు. బైపాస్ క్రాస్ చేస్తూ పంట భూములతో పాటు, మెండోరా మండల కేంద్రం రోడ్డుకు వెళ్లాలి. మెండోరా రోడ్డు గుండా పెద్ద వాగు రోడ్డుకు ప్రయాణం చేపట్టవచ్చు. దీంతో దూర భారం తగ్గుతుంది. అనేక గ్రామల ప్రజలు బైపాస్ క్రాస్ చేస్తూ ప్రయాణం సాగిస్తారు. దీంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. తాజాగా గత ఆదివారం ఓ యువకుడు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మండల కేంద్రవాసులు పంట భూములకు వెళ్లేప్పుడు ప్రమదాల బారిన పడుతున్నారు. పశువులు ప్రమాదాలకు గురవుతూ మత్యువాత పడుతున్నాయి. దీంతో అండర్ వే బ్రిడ్జ్ నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అండర్‌వే బ్రిడ్జ్ కావాలని ఢిల్లీ వరకు వీడీసీ ఆధ్వర్యంలో సభ్యులు వెళ్లారు. కాని ఇప్పటి వరకు నిర్మాణానికి మోక్షం లభించ లేదు.

నిబంధనలు అడ్డు..

జాతీయ రహదారిపై రెండు అండర్ వే బ్రిడ్జ్‌లకు మధ్య 4 కి.మీ దూరం ఉండాలని జాతీయ రహదారి అధికారులు తెలుపుతున్నారు. మండలంలోని కొత్తపల్లి శివారులో ఒక అండర్ వే బ్రిడ్జ్ ఉంది. ఆ బ్రిడ్జ్ నుంచి ప్రస్తుతం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్న జంక్షన్ వరకు సుమారు 2 కి.మీ మీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. దీంతో నిబంధనలు అడ్డు వస్తున్నాయని నేషనల్ హైవే అధికారులు చేతులెత్తేస్తున్నారు. నేషనల్ హైవే అధికారులు తప్పుడు నివేదిక ఇవ్వడం వల్లే బ్రిడ్జ్ మంజూరు కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు పక్కన ఉంటే నిబంధనలను సవరించి అండర్ వే బ్రిడ్జ్ నిర్మించవచ్చని నేషనల్ హైవే అధికారులు తెలుపుతున్నారు. కాని అక్కడ అలాంటివి లేకపోవడంతో బ్రిడ్జ్ మంజూరు కావడం లేదు. కాని ప్రమాదాలు ఆగడం లే దు.

ప్రాణాలు పోతున్నాయి..



జాతీయ రహదారి జంక్షన్ వద్ద వెంటనే అండర్ వే బ్రిడ్జిని నిర్మించాలి. లేదంటే ఏటా అనేక మంది ప్రాణాలు పోతున్నాయి. గతంలో చాలాసార్లు హైవే అధికారులకు చెప్పాం. కాని ఇప్పటివరకు నిర్మించలేదు. నిబంధనల పేరుతో కాలం వెళ్ల దీస్తున్నారు.

– ముస్కు నర్సయ్య, గ్రామస్తుడు

డ్రైడే రోజు.. మద్యం అమ్మకాల జోరు

- బెల్ట్‌షాపుల ద్వారా మద్యాన్ని విక్రయించిన వైన్ షాప్‌ల యజమానులు
- బెల్ట్ షాపులు వారి చేతుల్లోనే ఉండడంతో ఇష్టారాజ్యంగా అమ్మకాలు
- ఎక్సైజ్ శాఖ నిఘా వైఫల్యమే కారణం

మోర్తాడ్(బాల్కొండ): స్వాతంత్ర దినోత్సవం రోజున మద్యం అమ్మకాలను నిషేధించడమే కాకుండా డ్రైడేగా పాటించాలనే నిబంధన ఉన్నా బెల్ట్‌షాపుల ద్వారా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. మోర్తాడ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాల యజమానులే బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. అధికారికంగా వైన్స్‌లను మూసి ఉంచినా బెల్ట్‌షాపుల ద్వారా మద్యం దందా మాత్రం కొనసాగింది. బెల్ట్‌షాపులకు ఒకరోజు ముందుగానే మద్యంను తరలించి మంగళవారం రోజున యథేచ్ఛగా విక్రయించారు. మోర్తాడ్, ఏర్గట, కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లోని అన్ని బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలకు అడ్డు అదుపులేకుండా సాగింది. ఎక్సైజ్‌శాఖ నిఘా లోపంతో మద్యం ఏరులై పారినా పట్టించుకునేవారు కరువయ్యారు. వైన్ దుకాణాల యజమానుల చేతుల్లోనే బెల్ట్‌షాపులు ఉండటంతో డ్రైడే అనే తేడా లేకుండా మద్యం అమ్మకాలు కొనసాగాయి. బీరు, విస్కీ సీసాలపై రూ.5 నుంచి రూ.10వరకు ధర పెంచి విక్రయించడం గమనార్హం. మద్యం అమ్మకాలు జరిగిన తీరుపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సైకిల్‌ను ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



జక్కుల గంగారాం(ఫైల్)

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం సైకిల్‌పై వెళ్తున్న జక్కుల గంగారాం (35) అనే వ్యక్తిని బైక్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గంగారం సైకిల్‌పై కామప్ప చౌరస్తా వద్దకు వెళ్తుండా బీర్కూర్ గ్రామానికి చెందిన సమద్ అలియాస్ షారుఖ్, సుమేర్‌లు బైక్‌పై అతి వేగంతో బాన్సువాడ వైపు వెళ్తూ సైకిల్‌ను ఢీకొన్నారు. బైక్ వేగంతో ఉండడంతో సైకిల్‌పై ఉన్న గంగారం రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఫారుఖ్, సుమేర్‌కు తీవ్ర గాయలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఫారూఖ్‌కు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు.

బాధిత సర్పంచ్‌కు పరామర్శ



ఖలీల్‌వాడి: సస్పెన్షన్‌కు గురై ఆత్మహత్యా యత్నం చేసిన కల్లెడ సర్పంచ్ లావణ్య ఈ పరిస్థితి రావడానికి స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులే బాధ్యులని విపక్ష నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జీజీహెచ్‌లో లావణ్యను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా విపక్ష నాయకులు ప్రభా కర్, దేవరాం, కాంగ్రెస్ నేత పోల వెంకటేష్, టీడీపీ నేత దేగాం యాదాగౌడ్ మాట్లాడారు. గ్రామాభివృద్ధికి అప్పులు చేసి పనులు చేసిన నిధులు రాకపోవడంతో చావు బతుకుల్లో లావణ్య ఉందన్నారు. అభివృద్ధి చేయించిన పనులకు బిల్లులు రాక, ప్రశ్నించినందుకు స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వారిపై పగబట్టి ఇబ్బందుల పాల్జేయడం సరికాదన్నారు. లావణ్యకు న్యాయం చేయాలని వారి డబ్బులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విపక్ష నాయకులు అంబిక సత్యానారాయణ, లవంగ రాజు, ఫిరోజ్, రవి పాటిల్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.